## క్లుప్తంగా

### ముంపు బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ



చంద్రవరంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పార్టీ నాయకులు

చాగల్లు: చంద్రవరం గ్రామంలోని పేములు కాలువ ముంపు బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు అండగా నిలిచారు. ఈ కాలువ పొంగడంతో ముంపునకు గురైన గ్రామంలోని 10 కుటుంబాలకు సోమవారం ఆ పార్టీ నాయకులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. పంచాయతీ సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, ఆ పార్టీ నాయకులు బండి అశోక్ బాబు, భట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

### తగ్గుతున్న పేముల కాలువ వరద ఉధృతి



చాగల్లులో ప్రవహిస్తున్న పేముల కాలువ

చాగల్లు: మండలంలో పేముల కాలువ వరద ఉధృతి క్రమేపీ తగ్గుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరిన నీటితో ఐదు రోజులుగా ఈ కాలువ ఉధృతంగా ప్రవహించింది. ఫలితంగా పరీవాహక ప్రాంతాలైన చాగల్లు, చంద్రవరం, మల్లవరం, నెలటూరు, మార్కొండపాడు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. పంట పొలాల్లోకి, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. వరద వలన చాగల్లు – కాపవరం, మల్లవరం– చాగల్లు రైల్వే స్టేషన్ రహదారులు నీట మునిగాయి.

### బాధితులకు 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న తూర్పు చోడవరానికి చెందిన మానూరి పెద్దిరాజుకు మానవత సంస్థ మండలశాఖ సోమవారం రూ.నాలుగు వేల ఆర్థిక సాయం చేసింది. ఈ కార్యక్రమంలో చోడసాని గంగరాజు, సుంకర ప్రతాప్ ఆలపాటి హరి పాల్గొన్నారు. అలాగే ఆ సంస్థ పుల్లలపాడు గ్రామంలోని ఎచ్చెర్ల రామిశెట్టికి రూ.ఐదు వేల ఆర్థిక సాయం చేసింది. మానవత సంస్థ ఆ గ్రామ కన్వీనర్ పాతూరి జగదీష్ అదనంగా రామిశెట్టికి రూ.రెండు వేల సాయం చేశారు. ముసుళ్లగుంటలో అనారోగ్య బాధితులు తుమ్మలపల్లి కృష్ణమూర్తి, కోటనాగమ్మ, నందమూరి సూర్యారావు, గోపి నరసమ్మలకు ఒక్కొక్కరికి రూ.నాలుగు వేల చొప్పున రూ.14 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ స్ఫూర్తితో ముసుళ్లగుంట పంచాయతీ సర్పంచ్ నందమూరి శారదాదేవి 15 మంది పేదలకు రగ్గులు, పండ్లు అందజేశారు. కార్యక్రమాల్లో మానవత సంస్థ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు ఐడీపీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, దావులూరి చిరంజీవి, ఉప్పాడ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వరి పంట ధ్వంసం చేసిన 34 మందిపై కేసు

గోపాలపురం: సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించి వరి పంట నష్టానికి పాల్పడిన 34 మందిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై కె సతీష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం, ల్యాండ్ సీలింగ్ యాక్టు ద్వారా భీమోలు గ్రామంలోని కొంత భూమి 1990లో ప్రభుత్వానికి సంక్రమించింది. ఆ భూమిని గ్రామంలోని కొందరు పేదలు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. అందులో 14 ఎకరాల భూమి పెదవేగి జగ్గారావు, కొండుబోయిన అన్నవరం, మారెడ్డి జగ్గారావు అనే ముగ్గురికి చెందుతుందంటూ దాదాపు ఏడాది క్రితం సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఆ భూమిని ఆ ముగ్గురూ స్వాధీనం చేసుకొని కౌలుదారుల ద్వారా వరి సాగు చేయించుకుంటున్నారు. అందులో వేసిన వరి పంటను అంతకు ముందు అవే భూములను సాగుచేసుకున్న గ్రామంలోని పేదలు ఇటీవల ధ్వంసం చేశారు. దీనిపై హక్కుదారుల ఫిర్యాదు మేరకు 34 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. పంట నష్టం విలువ సుమరారు రూ.5 లక్షలు ఉంటుందన్నారు.

### స్కూల్ నిర్వహణ నిధుల కోసం హెచ్‌ఎంల నిరసన

కొవ్వూరు: పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగిన రామారావు ఆరోపించారు. 2022–23 సమగ్ర శిక్ష స్కూల్ గ్రాంట్స్ ఆడిట్ సందర్భంగా సోమవారం కొవ్వూరులోని ఎమ్మార్సీ భవనం వద్ద డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు నిరసన తెలిపారు. నిర్వహణ నిధులు విడుదల చేయక పోవడంతో తమ జీతాల నుంచి పాఠశాలలను నడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో ప్రధానోపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. టీఎస్ రామానుజం, డి.పద్మ సుజాత, పెరవలి ఎంఈవో -1 బీబీఎస్ స్వరూప్, కొవ్వూరు ఎంఈవో -2 కె.రామకిషోర్, జి.సత్యనారాయణరెడ్డి, జేవీ శ్రీనివాస్, సీహెచ్ సుబ్బలక్ష్మి, వీఏ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు యాత్ర విజయవంతం మన బాధ్యత

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పిలుపు
- 17 సాయంత్రం దేవరపల్లి మూడు రోడ్ల కూడలిలో నిర్వహణ
- సన్నాహాలపై వైఎస్సార్ సీపీ మండల శ్రేణులతో సమీక్ష
- పాల్గొన్న పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో ఈ నెల 17న నిర్వహించే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల స్థాయి సమావేశాన్ని సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ 17వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద బస్సు యాత్రకు భారీ ఎత్తున స్వాగతం పలకాలని సూచించారు. బస్సు యాత్రకు ముందు భాగంలో సుమారు మూడు వేల మందితో పాదయాత్ర జరుగుతుందన్నారు. ఈ యాత్ర కృష్ణంపాలెం నుంచి జాతీయ రహదారి మీదుగా దేవరపల్లిలోని మూడు రోడ్ల కూడలి నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుతుందన్నారు. ఈ యాత్రలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, ధర్మాన ప్రసాదరావు, జోగి రమేష్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారని ఎమ్మెల్యే తలారి వివరించారు. దేవరపల్లి మూడు రోడ్ల జంక్షన్‌లో సభ జరుగుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

**30 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు**

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 30 వేల మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు బస్సు యాత్రకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జనవరి నుంచి సామాజిక పింఛన్ రూ.3 వేలు కాబోతుందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. నియోజకవర్గంలో గృహ నిర్మాణంలో కొంత జాప్యం జరిగిందని, ప్రస్తుతం అన్నిచోట్లా ఇళ్ల నిర్మాణాలు పుంజుకున్నాయని తెలిపారు. నల్లజర్ల మండలంలో జగనన్న లే అవుట్‌లో 50 గృహాలకు ఉచితంగా విద్యుత్ సర్వీసులు ఇచ్చినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా పార్టీ గెలుపునకు దిశ దశా ఏర్పాటు చేయాలన్నారు. చిన్న చిన్న విభేదాలు ఉంటే పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రానికి మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయవలసిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రావు, గన్నమని వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బస్సు యాత్ర సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### బంగారు పాపమ్మకు మంత్రి వనిత పూజలు



ప్రక్కిలంకలో తుపాను బాధితులకు రేషన్ అందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: అన్నదేవరపేట గ్రామంలోని బంగారు పాపమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆదివారం రాత్రి పూజలు చేశారు. వేద పండితులు పూర్ణ కుంభంతో మంత్రికి స్వాగతం పలికారు.అనంతరం వనితను సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ ఎలిపే సుధారాణి, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు. కాగా అన్నదేవరపేట, ప్రక్కిలంక గ్రామాల తుపాను బాధిత కుటుంబాలకు హోం మంత్రి వనిత చేతుల మీదుగా నిత్యావసరాలు అందజేశారు. ప్రక్కిలంకలో 73, అన్నదేవరపేటలోని జాన్ పేటలోని 66 కుటుంబాలకు బియ్యం, తదితర రేషన్ కిట్‌లను అందజేశారు. అనంతరం తడిసిన ధాన్యాన్ని మంత్రి వనిత పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఎంతగానో నియోజకవర్గం అభివృద్ధి

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తాడిమళ్లలో మూడో రోజూ గడప గడపకూ..



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, సర్పంచ్ బయ్యే రాధారాణి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు ఆధ్వర్యంలో సోమవారం మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో పాటు జరిగిన అభివృద్ధిపై ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. తాడిమళ్ల గ్రామంలో ప్రధానంగా వైఎస్సార్ జలకళ కార్యక్రమంలో భాగంగా అర్హులైన రైతులకు ఉచితంగా బోర్లు వేశామని చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పార్టీ నాయకులు కాగిత లక్ష్మయ్య, తిరుమళ్ల దుర్గారావు, నిజంపూడి వెంకటేశ్వరరావు, పెనుగొండ సూరిబాబు, యాదల వరప్రసాద్, కొయ్యే బాబూరావు, ముప్పిడి సూరిబాబు, బయ్యే లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# పనితీరు మార్చుకోకపోతే బదిలీ తప్పదు

- పెరవలి పీహెచ్‌సీ పనితీరుపై ఎంపీపీ ప్రసాద్ అసంతృప్తి
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: స్థానిక పీహెచ్‌సీపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, గతంలో పలుమార్లు చెప్పినా వైద్యులు తీరు మార్చుకోవడం లేదని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై పనితీరు మార్చుకోకపోతే బదిలీ తప్పదని హెచ్చరించారు. పెరవలి మండలం పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశానికి మండల స్థాయి అధికారులు కాకుండా, క్రింది స్థాయి సిబ్బందిని పంపించడం తగదన్నారు. తుపాను పంట నష్టం అంచనాల కోసం ఇటీవల గ్రామాలకు వెళ్లిన అధికారులు, ఆ విషయాన్ని ముందుగా ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తెలియజేయకపోతే ఎలా అని ప్రశ్నించారు.

**18 వరకూ పంట నష్టం అంచనాకు గడువు**

మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను పంట నష్టం అంచనాల నమోదుకు ఈ నెల 18 వరకూ గడువు ఉందన్నారు. మండలంలో గత మూడు రోజుల్లో వర్షానికి తడిసిన 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామన్నారు. ఈ నెల 18న మరో తుపాను ఏర్పడుతుందని, ఈ లోగా రైతులు వరి కోతలు ముగించుకోవాలని ఏవో సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలో 18 వాటర్ ట్యాంకుల, 70 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్ల పనులు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగరాజు మాట్లాడుతూ మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ బ్యాంక్ లింకేజీ రుణాలు రూ.32.75 కోట్లు, ఆసరా పథకం ద్వారా 1535 సంఘాలకు రూ.18.65 కోట్ల రుణాలు, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.2.75 కోట్ల రుణాలు అందించామన్నారు.ఎంఈఓ స్వరూప్ మాట్లాడుతూ మండలంలోని 586 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 24న ట్యాబ్‌లు పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీడీఓ రమేష్, వివిధ శాఖల అధికారులు, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# పట్టాలు ఇవ్వాలంటూ భీమోలు వాసుల నిరసన



ట్రైనీ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భీమోలు గ్రామస్తులు

గోపాలపురం: భీమోలు గ్రామంలోని 340 ఎకరాల భూములపై తమకు హక్కు పట్టాలు ఇప్పించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన కొందరు సోమవారం గోపాలపురంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.1976 నుంచి తాము ఆ భూమిని సాగు చేసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. చట్టాలను అడ్డు పెట్టుకుని రూ.కోట్ల విలువైన ఆ భూము లను టీడీపీ నాయకులు స్వాధీనం చేసుకున్నారని వారు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ వారు ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సాలి వేణు, కొడవటి బుజ్జిబాబు, కాకులపాటి శ్రీను, కాకులపాటి వెంకట్రావు పాల్గొన్నారు.

# శివోహం.. భక్తజన సందోహం

- శైవ క్షేత్రాల్లో కార్తిక సోమవారం పూజలు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: కార్తిక మాసంలోని ఆఖరి సోమవారం కావడంతో భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని కాట కోటేశ్వరంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు విశేష పూజలు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు భక్తులకు వడ్డించారు. తాడిమళ్లలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, కంసాలి పాలెంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, ఉనకరమిల్లిలోని ఉమా లింగేశ్వరస్వామి, సమిశ్రగూడెంలోని శ్రీపర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు పెనుగుర్తి రాము పాల్గొన్నారు.

నిడదవోలు: స్థానిక చినకాశి రేవులో వేకువ జామునే స్నానాలు ఆచరించిన భక్తులు శైవ క్షేత్రాల్లో పూజలు చేశారు. పురాతన రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు నిత్యాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వేద పండితులు మంత్రాల నడుమ భక్తులు ఆకాశ దీపం నిర్వహించారు. సోమేశ్వరస్వామి గుడిలో స్వామివారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి లలితా సహస్ర నామాలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ ఈవోలు నామా సూర్యప్రకాశరావు, సోమాల శివ, అర్చకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలో కొలువైన రామలింగేశ్వరస్వామిని లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన లక్ష బిల్వార్చనలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అలాగే వెలగదుర్రులోని అన్నపూర్ణా విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో లక్ష పత్రి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు ఈ పూజలో పాల్గొనడమే గాకుండా స్వామి వారిని దర్శించుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, దేవస్థానం చైర్మన్ దొడ్డా సూర్యా నారాయణ, పాలంగి, వెలగదుర్రు సర్పంచ్‌లు బొక్క శ్రీనివాసు, సాగి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉండ్రాజవరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి సహస్ర నామాలతో కుంకుమ పూజలు చేశారు.

దేవరపల్లి: పల్లంట్ల గ్రామంలోని దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వ పత్ర పూజ చేశారు.

**చాగల్లు మండలంలో..**

చాగల్లు: వేకువజాము నుంచే చాగల్లులోని రాజరాజేశ్వరిస్వామి, చిక్కాల, కలవలపల్లి, ఊనగట్ల, మార్కొండపాడు ఉమామార్కండేయ స్వామి ఆలయాల్లో కార్తిక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెంలోని బాలరామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు చేశారు.



కాట కోటేశ్వరంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు



బ్రాహ్మణగూడెంలో సుందరంగా అలంకరించిన బాలరామలింగేశ్వరస్వామి వారు

# రూ.1.50 కోట్లతో రోడ్ల అభివృద్ధి

**హోం మంత్రి తానేటి వనిత**



కొవ్వూరు: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ నిధులు మంజూరైనట్టు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ప్రకటించారు. ఐ.పంగిడిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద నుంచి జీఎస్‌టీ రోడ్డు వరకూ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నుంచి మరో వైపు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించారన్నారు. అలాగే చాగల్లు ఇందిరమ్మ కాలనీకి తారు రోడ్డు నిర్మాణాన్ని రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు కలెక్టర్ పాలనాపరమైన ఆదేశాలు కూడా జారీ చేశారని మంత్రి తెలిపారు. జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్టు నిధులతో పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ పనులు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాను కలిసి నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరామన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి ఈ నిధులను సమకూర్చారని తెలిపారు.

# ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



తిమ్మరాజుపాలెంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగుర వేస్తున్న పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు



దేవరపల్లి మండలం రామన్నపాలెం గ్రామ సచివాలయం వద్ద డిస్ ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దుర్గారావు



తెలికిచెర్లలో డిస్ ప్లేబోర్డు ఆవిష్కరిస్తున్న కారుమంచి రమేష్ తదితరులు

నిడదవోలు రూరల్: పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పలు ప్రాంతాల్లో ఉత్సాహంగా సాగుతోంది. మండలంలోని తిమ్మరాజుపాలెంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. తిమ్మరాజుపాలెం, సూరాపురం గ్రామాల పరిధిలో రూ.22.34 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు, రూ.6.34 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పతాకాన్ని పల్లారావు ఎగుర వేశారు. సంక్షేమ పథకాలపై రెండు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సహపంక్తి భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, ఉప సర్పంచ్ కీర్తి శ్రీనివాస్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల శ్రీను, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి కేవీ సుబ్బన్న, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డే రావాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. మండలంలోని రామన్నపాలెం సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కూచిపూడి బుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపీపీ దుర్గారావు మాట్లాడారు. అనంతరం గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ పతాకాన్ని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ ఎగుర వేశారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి పల్లె నిద్ర చేశారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, మాజీ సర్పంచ్ కూడిపూడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వర రెడ్డి, గ్రామ సచివాలయం కార్యదర్శి నిట్టా రవికిషోర్ పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని తెలికిచెర్ల–1 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. గ్రామంలో రూ.25 కోట్ల వ్యయంతో చేసిన అభివృద్ధి పనుల డిస్ ప్లే బోర్డును, పార్టీ పతాకాన్ని ముఖ్య అతిథిగా హాజరైన జేసీఎస్ జిల్లా కన్వీనర్ కారుమంచి రమేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయ మద్దతు తీసుకున్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి రాజ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుంచే విష్ణుమూర్తి, ఈఓపీఆర్డీ సింహాద్రి, గృహ నిర్మాణ శాఖ ఏఈ శివ, ఐకేపీ ఏపీఎం కె.విజయ నిర్మలకుమారి పాల్గొన్నారు.

పెరవలి: కాకరపర్రు సచివాలయం వద్ద నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ గ్రామ సచివాలయం వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సమాచార బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఎగురు వేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎంపీపీ ఇంటింటికీ వెళ్లి రాష్ట్రానికి వైఎస్ జగన్ ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ మండల శాఖ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, కొమ్మిశెట్టి రాము, జేసీఎస్ మండల కన్వీనర్ రామగుడుల సూర్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా, మండల శాఖల అధ్యక్షులు పాట్టి రాంబాబు, బీరా రాజు, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ల పోస్టుల భర్తీకి ఈనెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ సోమవారం తెలిపారు. అట్లపాడు సచివాలయ పరిధిలో (సీ4, సీ8–ఎస్సీ), (సీ5–జనరల్), సమిశ్రగూడెం సచివాలయ–2లో (సీ2–జనరల్), డి.ముప్పవరం (సీ7–ఎస్సీ), కోరుమామిడి–2లో (సీ2–ఎస్సీ మహిళ) పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

తాళ్లపూడి: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీ దరఖాస్తులు కోరుతున్నట్టు ఎంపీడీవో టి. వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన ఎంపీపీ జొన్నకూటి పోసిరాజుతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. ప్రక్కిలంక -1, తిరుగుడుమెట్ట- 1, వేగేశ్వరపురం- 2, అన్నదేవరపేటలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల14 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

# సమిశ్రగూడెంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, దైవజనులు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం బెతేస్థ వర్షిప్ ప్రార్థన మందిరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ కేక్‌ను సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, దైవజనులు ఎస్‌వీ రావు కట్ చేశారు. చిన్నారుల క్రిస్మస్ నాటికలు, యాక్షన్ సాంగ్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం క్రైస్తవ విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, నాయకులు మద్దాల ప్రభు, నాగిరెడ్డి సత్తిపండు, దేశాబత్తుల నాగు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ సంస్థకు రూ.4 లక్షల విరాళం

నిడదవోలు: రోటరీ అంతర్జాతీయ సేవా సంస్థకు (పోలియో ఫండ్) కింద రూ. 2 లక్షల నగదును రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు రోటరీ గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావుకు అందజేశారు. మరో రూ.2 లక్షలు ఆన్‌లైన్ ద్వారా రోటరీ అంతర్జాతీయ సేవా సంస్థకు పంపించినట్టు ఆయన పేర్కొన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్- 3020 గవర్నర్ అధికార పర్యటనలో భాగంగా రోటరీ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని గవర్నర్‌కు అందజేశారు. సందర్భంగా గవర్నర్ వెంకట సుబ్బారావును గజమాలతో సత్కరించారు. మండలంలోని డి. ముప్పవరంలోని రోటరీ కైలాస భూమి అభివృద్ధికి రూ. లక్ష నగదును గవర్నర్ సుబ్బారావు విరాళంగా ప్రకటించారు. మునిసిపల్ చైర్మన్ భూపతి ఆది నారాయణ, మారిశెట్టి అమ్మి రాజు, గోపిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.